క్లుప్తంగా

మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలి

మార్కాపురం టౌన్: బేస్తవారిపేట మండలం కలగట్ల గ్రామం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మార్కాపురం మండలం భూపతిపల్లి గ్రామానికి చెందిన మల్లాపురం శ్రీను, మొండెం కాశయ్య కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం, రెండెకరాల భూమి కేటాయించి ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా వ్యవసాయకార్మిక సంఘం ఉపాధ్యక్షులు గుమ్మా బాలనాగయ్య కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కూలి పనుల కోసం వెళ్లి మృతి చెందడం బాధగా ఉందన్నారు. చనిపోయిన రెండు కుటుంబాల వారు నిరుపేదలని, వారితోపాటు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న బాలయ్య, నాగేశ్వరరావు కుటుంబాలను కూడా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఆదాయం తెస్తున్న ఉద్యోగులను ఆదర్శంగా తీసుకోవాలి



సిబ్బందికి నగదు బహుమతులు అందజేస్తున్న డీఎం నరసింహులు

మార్కాపురం: ఆర్టీసీకి ఆదాయం తెస్తున్న ఉద్యోగులను మిగిలినవారు ఆదర్శంగా తీసుకొని ఆదాయం పెంచేందుకు కృషి చేయాలని డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు సూచించారు. శుక్రవారం డిపోలో నిర్వహించిన సమావేశంలో డీఎం మాట్లాడారు. ఇటీవల మార్కాపురం ఆర్టీసీ డిపోకు అత్యధికంగా ఆదాయం తెచ్చిన కండక్టర్లు ఎస్.రాములు, టి వెంకటేశ్వర్లు, టీపీఎస్ రావు, జె.శ్రీనివాసులు, ఆర్‌సీహెచ్ పాపయ్య, ఎంఎస్ శ్రీనివాసులు, డ్రైవర్లు వైవీ కాశయ్య, ఆర్‌ఎమ్ నాయకులను నగదు బహుమతులు అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ అధ్యక్షుడు కాశయ్య, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి సహకరించాలి



పిచ్చి మొక్కలతో నిండిన శ్మశానం

తర్లుపాడు: తర్లుపాడులోని హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి దాతలు సహకరించాలని సామాజిక కార్యకర్త, ఉపాధ్యాయుడు జగన్ బాబు కోరారు. హిందువులు చనిపోతే దహన సంస్కారాలు చేసేందుకు శ్మశానవాటికకు రహదారి కూడా లేదని, కర్మకాండలు చేసుకునేందుకు వీల్లేకుండా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్యవైశ్య సంఘంలోని పలువురు దాతల సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టామని, నిధుల లేమితో అర్ధంతరంగా పనులు నిలిచిపోయాయని తెలిపారు. మృతి చెందిన వారిని దహనం చేసే స్థలంలో శ్లాబ్, శ్మశాన వాటిక కాంపౌండ్ పూర్తి చేయాల్సి ఉందని, దాతలు స్పందించి సహకరించాలని కోరారు.

రేపు ఒంగోలులో మెగా మ్యూజికల్ నైట్

ఒంగోలు మెట్రో: నగరంలో ప్రముఖ గాయనీ, గాయకులతో ఆదివారం మెగా మ్యూజికల్ నైట్ జరుగబోతోంది. ఆ రోజు సాయంత్రం ఆరు గంటల నుంచి స్థానిక హెడ్ పోస్టాఫీసు ఎదురుగా ఉన్న హైదరీ క్లబ్‌లో గంధర్వ గాన తరంగిణి పేరుతో నిర్వహించబోయే మెగా మ్యూజికల్ నైట్లో గాయకులు రాము, బాల కామేశ్వరరావు, గాయత్రీ నారాయణన్, నాదప్రియ తదితరులు పాల్గొననున్నారు.

మార్కెట్ వ్యూ



రైతు బేజారు!

- మార్కాపురంలో కలగా మారిన రైతు బజారు
- మార్కెట్‌లో వ్యాపారులు చెప్పిందే ధర
- రైతులకు దళారులే దిక్కు
- రోడ్డుపై అమ్మాలంటే పోలీసుల భయం

డివిజన్ కేంద్రమైన మార్కాపురంలో రైతు బజారు నిర్మాణం ఓ అడుగు ముందుకు.. నాలుగు అడుగులు వెనక్కు అన్నట్టుగా ఉంది. రైతు బజారు నిర్మాణంతో ముఖ్యంగా రైతులు, ఆపై ప్రజలకు మేలు చేకూరుతుందని పాలకులకు తెలిసినా పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 7 నెలలు గడిచినా రైతు బజారు నిర్మాణంపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో రైతులు, ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

మార్కాపురం:

సుమారు లక్షకు పైగా జనాభా ఉన్న మార్కాపురం పట్టణంలో అధికారికంగా మున్సిపాలిటీ ఎదురుగా పురాతన కూరగాయల మార్కెట్ మాత్రమే ఉంది. పెరిగిన జనాభాకు అనుగుణంగా మార్కెట్‌ను అభివృద్ధి చేయకపోవడం, రైతు బజారు నిర్మించకపోవడంతో కూరగాయల క్రయ విక్రయాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న పరిస్థితి.

రైతులకు నిత్యం ఇక్కట్లు

మార్కాపురం సమీప గ్రామాలైన దరిమడుగు, బోడపాడు, ఇడుపూరు, గజ్జలకొండ, నికరంపల్లి, నాగులవరం, చింతగుంట్ల, తిప్పాయపాలెం, శివరాంపురం, కొండేపల్లి, పెద్దారవీడు మండలంలోని తోకపల్లి, దేవరాజుగట్టు, కొత్తపల్లి, పెద్దారవీడు, తర్లుపాడు మండలంలోని సీతానాగులవరం, పోతలపాడు, సూరేపల్లి తదితర గ్రామాల రైతులు సీజన్‌లో పండించిన కూరగాయలను మార్కెట్‌కు తెచ్చి అమ్ముకోవాలంటే అనేక ఆంక్షలున్నాయి. మార్కెట్‌లో దళారులు, వ్యాపారులు తక్కువ ధరకు కూరగాయలు కొనుగోలు చేస్తుండటంతో రైతులు నష్టపోతున్నారు. దళారులను కాదని బయట అమ్మాలంటే పోలీసులు ఊరుకోరు. ఈ నేపథ్యంలో రైతు బజారు అందుబాటులో ఉంటే తమకు ఇబ్బందులు తప్పుతాయని రైతులు అభిప్రాయపడుతున్నారు.

వీరికి మార్కెట్ చాలా దూరం

మార్కాపురం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పలువురు చిరు వ్యాపారులు బండ్లపై, రోడ్లపై కూరగాయలను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఇందిరమ్మ కాలనీ, పూలసుబ్బయ్య కాలనీ, ఎస్సీ, బీసీ కాలనీ, అరుణోదయ కాలనీ, టీచర్స్ కాలనీ, కొండారెడ్డికాలనీ, భగత్‌సింగ్ నగర్, ఎస్టేట్, ఏకలవ్య కాలనీ తదితర ప్రాంతాల వారు కూరగాయలు కొనాలంటే సుమారు రెండు నుంచి మూడు కిలోమీటర్లు రావాలి. దీంతో ఆటో చార్జీలు, టూవీలర్లపై వచ్చే వారైతే పెట్రోల్ అదనపు భారం అవుతుంది. దీంతో బండ్లమీద అమ్మే కూరగాయలను అధిక ధర అయినా కొనుగోలు చేస్తున్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో కూరగాయల విక్రయ కేంద్రాలు, రైతు బజారు ఏర్పాటు చేస్తే ఈ సమస్య తీరుతుంది. మార్కాపురం నుంచి త్రిపురాంతకం, దోర్నాల, కంభం, తర్లుపాడు, పెద్దారవీడు, యర్రగొండపాలెం, శ్రీశైలం తదితర ప్రాంతాలకు రోజూ దాదాపు రూ.5 లక్షల విలువైన కూరగాయలు ఎగుమతి అవుతున్నాయి. రైతు బజారు నిర్మిస్తే దళారుల ప్రమేయం లేకుండా రైతులే నేరుగా కూరగాయలు విక్రయించుకునే అవకాశం ఉంటుంది.



కూరగాయల విక్రయాలు

రైతులకు,ప్రజలకు ఉపయోగం

- మార్కాపురంలో రైతు బజారు ఏర్పాటు చేసినట్లయితే రైతులే నేరుగా మార్కెట్‌కు వచ్చి అమ్ముకోవచ్చు.
- పండించే రైతుకు గిట్టుబాటు ధర లభిస్తుంది.
- ప్రజలకు అధిక ధరల బాధ ఉండదు.
- ప్రజలకు నాణ్యమైన కూరగాయలు, తాజా కూరగాయలు లభిస్తాయి.
- రైతు బజారు మేనేజర్ ఎప్పటికప్పుడు తాజా కూరగాయలు తెప్పించడంతో పాటు ధరలపై నియంత్రణ ఉంటుంది.



రైతు బజారు ఏర్పాటు చేయాలి



మార్కాపురం పట్టణంలో ప్రభుత్వం రైతు బజారు ఏర్పాటు చేస్తే మాలాంటి రైతులు పండించిన పంటలను నేరుగా వినియోగదారులకు అమ్ముకోవచ్చు. ఇప్పుడు మేము వ్యాపారులకు విక్రయిస్తే వారు ప్రజలకు అధిక ధరలకు అమ్ముతున్నారు. అలా కాకుండా నేరుగా రైతులు అమ్ముకునే ఏర్పాట్లను ప్రభుత్వం చేయాలి.

– లక్ష్మీరెడ్డి, రైతు, వేములకోట

నిరుపయోగంగా బస్ షెల్టర్లు



తలమళ్లలో శిథిలమైన షెల్టర్

పొదిలి రూరల్: ప్రయాణికులు వేచి ఉండేందుకు బస్ షెల్టర్లు లేక కొన్ని గ్రామాల్లో ఇబ్బందులు పడుతుండగా మరికొన్ని చోట్ల షెల్టర్లు శిథిలావస్థకు చేరాయి. పొదిలి మండలంలో ఉన్నగురువాయుపాలెం, కుంచేపల్లి ఎస్సీ కాలనీ, మల్లవరం, కాటూరివారిపాలెం, తలమళ్ల, గొగినేవారిపాలెం, కంభాలపాడు, బట్టువారిపల్లెలో బస్సు షెల్టర్లు ఉన్నాయి. వీటిలో కంభాలపాడు, తలమళ్ల, బట్టువారిపల్లె బస్సు షెల్టర్లు శిథిలావస్థకు చేరడంతో కూర్చోవడానికి, కనీసం నిలబడటానికి కూడా వీల్లేని విధంగా ఉన్నాయి. మరి కొన్ని షెల్టర్లలో వాహనాలు పార్కింగ్ చేయడం, కట్టెలు వేయడంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఉప్పలపాడు, పోతవరం, రామాయణకండ్రిక, సలకనూతలబస్టాండ్‌తోపాటు పట్టణంలోని పెదబస్టాండ్, చిన్న బస్టాండ్, విశ్వనాథపురంలో అసలు బస్ షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు ఎండలోనే వేచి ఉంటున్నారు. ఎండకు తాళలేని వారు సమీపంలోని బడ్డీ బంకుల వద్దకు చేరుతున్నారు. వేసవి, వర్షాకాలంలో ప్రయాణికులకు మరిన్ని ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు చొరవ తీసుకుని బస్ షెల్టర్లను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



కట్టెలు వేయడంతో నిరుపయోగంగా మారిన బట్టువారిపల్లి బస్ షెల్టర్



గోగినేనివారిపాలెంలో నిరుపయోగంగా బస్ షెల్టర్

ఎంఈఎఫ్‌ను బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐజక్

మార్కాపురం టౌన్: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, ఎంఎఎస్పీ, ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాల బలోపేతానికి సభ్యులు కృషి చేయాలని మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.ఐజక్ కోరారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని మాదిగ ఉద్యోగులు సభ్యత్వం తీసుకోవాలని, జాంభవ భవన నిర్మాణంపై దృష్టి సారించాలని, సంఘాల బలోపేతానికి కృషిచేయాలన్నారు. అద్దంకి ప్రాంతంలోని మాదిగ ఉద్యోగులు సంఘంలో చేరాలన్నారు. మాదిగల చిరకాల లక్ష్యమైన ఎస్సీ వర్గీకరణ సాధించేందుకు అన్ని విధాలుగా సహకరించాలని కోరారు. అనంతరం ఉద్యోగ సంఘ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎంఈఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లూరి శేషయ్య, రాష్ట్ర నాయకులు కుమార్, రామారావు, పందీటి కాశీరావు, రాచీటి సంజీవ్‌కుమార్, మందా ప్రసాద్, హానోజీరావు, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ దేవరాయలు జయంతి



శ్రీకృష్ణదేవరాయులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘ నాయకులు

మార్కాపురం: దేశ భాషలందు తెలుగు లెస్స అని తెలుగు ఔన్నత్యాన్ని చాటిచెప్పిన మహనీయుడు శ్రీకృష్ణదేవరాయలు అని అఖిల భారత యాదవ మహాసంఘం జాతీయ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ పిన్నిక లక్ష్మీప్రసాద్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం బీసీ భవన్‌లో శ్రీకృష్ణదేవరాయులు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పీఎల్పీ యాదవ్ మాట్లాడుతూ.. 15వ శతాబ్దంలో రాయలవారు మార్కాపురం ప్రాంతాన్ని సందర్శించి స్వామివారి ఆలయంలో రామానుజాస్వామి ఆలయం, ఆళ్వార్లను ఏర్పాటు చేయడంతోపాటు స్వామివారి ఆలయంలో ప్రధాన గాలిగోపురం మొదటి అంతస్తును నిర్మించారని గుర్తు చేశారు. కోనేరు నిర్మాణం, కోనేటికి నలుదిశలా నాలుగు ఆంజనేయస్వామి ఆలయాలు, అక్కడే వేణుగోపాలస్వామి ఆలయాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఆలయం లోపల ఆంజనేయస్వామి ఉపాలయం, రెండు విజయ స్థూపాలను నిర్మించిందీ రాయలవారేనని చెప్పారు. వీటితోపాటు నాలుగు మాఢవీధుల్లో మండపాలను ఏర్పాటు చేసిన ఘనత కృష్ణదేవరాయలకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు రంగస్వామి గౌడ్, వంకేశ్వరం శ్రీనివాస్, నాగం రామకృష్ణ, వెంకటేష్, గుమ్మా రాజగోపాల్, పిన్నిక చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు

- వాహనదారులకు పోలీసుల హెచ్చరిక
- ప్రమాదకర ప్రయాణంపై రైతు కూలీలకు కౌన్సెలింగ్

మార్కాపురం: మార్కాపురం ప్రాంత పరిధిలో ఆటోలు, ట్రాక్టర్లు, షేర్ ఆటోల యజమానులు పరిమితికి మించి ప్రయాణికులను, కూలీలను ఎక్కించుకున్నా, వెనుక వైపు డోర్లు ఓపెన్ చేసినా సీజ్ చేస్తామని, యజమానులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని సీఐ పి.సుబ్బారావు హెచ్చరించారు. బేస్తవారిపేట మండలం కలగట్ల వద్ద జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో ఇద్దరు కూలీలు మరణించిన నేపథ్యంలో పోలీసులు, రవాణాశాఖాధికారులు అప్రమత్తమయ్యారు. శుక్రవారం ఉదయం మార్కాపురం సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో వై జంక్షన్, ఎస్టేట్, కుంట తదితర ప్రాంతాల్లో రూరల్ ఎస్సై అంకమరావు, టూటౌన్ ఎస్సై రాజమోహన్‌రావు, సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. పరిమితికి మించి ప్రయాణికులను, కూలీలను తరలిస్తున్న డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చి జరిమానా విధించారు. సీఐ మాట్లాడుతూ.. కేవలం ఇద్దరు మనుషుల ద్వారా వచ్చే 40, 50 రూపాయల కోసం చూసుకుని ప్రమాదాలకు కారణమవుతూ వారి కుటుంబాల్లో విషాదాన్ని నింపవద్దని హెచ్చరించారు. ప్రమాదాల నివారణకు ఆటో డ్రైవర్లు, ట్రాక్టర్ల యజమానులు, ద్విచక్ర వాహనదారులు సహకరించాలని కోరారు.



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సుబ్బారావు



కంభంలో రైతు కూలీలు, డ్రైవర్‌కు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై

కంభం: స్థానిక వై జంక్షన్‌లో శుక్రవారం పోలీసులు ముమ్మరంగా వాహనాలు తనిఖీలు చేశారు. వ్యవసాయ కూలీలతో వెళ్తున్న పలు ఆటోలను ఆపి డ్రైవర్లకు, కూలీలకు ఎస్సై నరసింహరావు చకౌన్సెలింగ్ ఇచ్చారు. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు అధికమయ్యాని, ఆటో డ్రైవర్లు నిబంనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పలు వాహనాలకు జరిమానా విధించారు.

పాత కక్షలతో ఇరు వర్గాల ఘర్షణ

- ఒకరికి తీవ్ర గాయాలు

గిద్దలూరు రూరల్: పాత కక్షల నేపథ్యంలో ఇరు వర్గాల మధ్య తలెత్తిన ఘర్షనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం రాత్రి గడికోట గ్రామ పంచాయతీ దేవనగరం గ్రామంలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నరసింహులు, అతని కుమారుడు శ్రీకాంత్ మద్యం బెల్టుషాపు నిర్వహిస్తుంటారు. నారాయణరెడ్డి మద్యం కొనుగోలు తాలూకూ నగదు బాకీ విషయమై బుధవారం నరసింహులుతో వాగ్వివాదం చోటుచేసుకుంది. గతంలో వీరి మధ్య ఓ స్థలం విషయంలో ఘర్షణలు తలెత్తాయని సమాచారం. అయితే నారాయణరెడ్డికి మద్దతుగా మాట్లాడిన కోటేశ్వరరెడ్డిపై శ్రీకాంత్ కర్రతో దాడి చేసి గాయపరిచాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం గిద్దలూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. పరస్పర ఫిర్యాదు మేరకు ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఘనంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం



త్యాగరాజస్వామి గ్రామోత్సవం

బేస్తవారిపేట: స్థానిక టీచర్స్ కాలనీలో త్యాగరాజ స్వామి ఆలయంలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై త్యాగరాజస్వామి చిత్రపటాన్ని ఉంచి ఆలయం వద్ద నుంచి బస్టాండ్, సోమవారిపేట వరకు గ్రామోత్సవం నిర్వహించారు. మండలంలోని నాయీబ్రాహ్మణులు వాయిద్యాలు, సంకీర్తనలతో కనుల పండువగా గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం వద్ద మధ్యాహ్నం అన్న సంతర్పణ చేశారు. మండలంలోని నాయీ బ్రాహ్మణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఆలయం వద్ద పూజలు చేస్తున్న నాయీ బ్రాహ్మణులు

రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ వెంకటేశ్వర్లు



ప్రతిజ్ఞ చేస్తున్న క్రీడాకారులు

- వివిధ జిల్లాల నుంచి 28 జట్లు హాజరు

పొదిలి రూరల్: క్రీడాకారులు క్రీడలపై ప్రత్యేక దృష్టి సారిస్తే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని సీఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం పొదిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో 28వ రాష్ట్ర స్థాయి జూనియర్ సెపక్‌తక్రా చాంపియన్‌షిప్‌ను ఆయన ప్రారంభించారు. క్రీడకారులను పరిచయం చేసుకుని అభినందించారు. పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 28 బాలబాలికల జట్లు పాల్గొన్నాయి. పోటీల నిర్వహణకు నాలుగు క్రీడా కోర్టులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్సై వి వేమన, అమరనాథ్, మధు, శ్రీనివాసులు పాల్గొన్నారు.





పొదిలిలో మొదలైన సెపక్‌తక్రా పోటీలు

తురిమెళ్లలో ఉచిత వైద్య శిబిరం

కంభం: శ్రీకృష్ణదేవరాయలు జయంతిని పురస్కరించుకుని మండలంలోని తురిమెళ్ల గ్రామంలో శుక్రవారం శాంతిరామ్ హాస్పిటల్ నేతృత్వంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా బలిజ సేవా సంఘం నాయకులు శ్రీకృష్ణదేవరాయలు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వైద్య బృందం రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట మండలాల నాయకులు పాల్గొన్నారు.